క్లుప్తంగా

వ్యాధులు ప్రబలకుండా సప్తవర్ణ దుప్పట్లు



దుప్పట్లు ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వ్యాధులు ఒక రోగి నుంచి మరో రోగికి ప్రబలకుండా సప్తవర్ణ దుప్పట్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. లియో టెక్ ప్రాసెస్ వారి సహకారంతో బుధవారం సప్తవర్ణ దుప్పట్లను ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రోజుకో కలర్ దుప్పట్లను పడకలపై వాడేలా ఆయా విభాగాల స్టాఫ్ నర్సులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 వెంకటతులశమ్మ, గ్రేడ్-2 నాగమణి, సావిత్రి బాయి, లియో టెక్ ప్రాసెస్ మేనేజర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

చిత్తడిగా కలెక్టరేట్



చిత్తడిగా మారిన డ్వామా, డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు అర్బన్‌లో అధిక వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నగరంలో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కర్నూలు అర్బన్‌లోనే 45.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా పరిపాలన కేంద్రం కలెక్టరేట్ మొత్తం లీకేజీలతో చిత్తడిగా మారింది. లీకేజీ నీటి కోసం పలు కార్యాలయాల్లో బకెట్లు ఉంచారు. కర్నూలు అర్బన్‌లో జూలై సాధారణ వర్షపాతం 121.3 మి.మీ కాగా 171.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

విజేతలకు అభినందనలు



కరాటే విజేతలను అభినందిస్తున్న మేయర్ రామయ్య

కల్లూరు: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 23న విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో అండర్ -10, 12, 13, 16, 17 విభాగాల్లో విశ్వేష్, మహ్మద్ గౌస్, విశ్వకల్ప చైత్ర, జశ్వంత్ గౌడ్ పతకాలు సాధించారు. వీరిని బుధవారం ఏబీ కరాటే అకాడమీ కోచ్ ఫయాజ్ ఆధ్వర్యంలో నగర మేయర్ బీవై రామయ్య తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



తూకాన్ని పరిశీలిస్తున్న ఏసీ శ్రీరాముడు

కర్నూలు (న్యూసిటీ): తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు హెచ్చరించారు. బుధవారం ఆయన నగరంలని సీ క్యాంప్, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్ తదితరల ప్రాంతాల్లో రైస్, కిరాణం, ఫర్టిలైజర్ షాపులను పరిశీలించారు. రాజ్‌విహార్ వద్ద ఉన్న ఓ రైస్ దుకాణంలో బియ్యం బస్తాను తూకం వేయగా 26 కేజీలకు గానూ కేజీ తక్కువ ఉండటంతో 4 కేసులు, రైస్ బస్తాలపై తయారీదారుడి చిరునామా లేకపోవడంతో రెండు కేసులు నమోదు చేసి, ఆయా దుకాణాల యజమానులకు రూ.లక్ష జరిమానా విధించామని ఆయన తెలిపారు.

ఏఓ నాగమణికి సన్మానం



ఏఓ నాగమణిని సన్మానిస్తున్న ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు పదోన్నతిపై ఏఓగా వెళ్లిన నాగమణిని బుధవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని ధన్వంతరి హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఆసుపత్రిలో విధులు నిర్వహించిన నాగమణి ఇటీవల ఏఓగా పదోన్నతి పొంది వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ కావడం అభినందనీయమన్నారు. ఆసుపత్రిలో ఆమె అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి ఏడీ రమేష్ బాబు, ఏఓ శైలజ, అకౌంటెంట్ కుమారస్వామి పాల్గొన్నారు.



వర్షం పడితే నాకేంటి: నెత్తిన టవల్‌తో దినచర్యకు బయలుదేరిన వృద్ధురాలు



జోరు వర్షంలో గొడుగుల మాటున..



స్విమ్ రైడ్: బైక్‌లు దూసుకెళ్తుండగా ఎగిసిపడుతున్న వర్షపు నీరు



కొండారెడ్డి బురుజును కమ్మేసిన మేఘాలు

ముంచెత్తిన వాన

కర్నూలు నగరాన్ని వాన ముంచెత్తింది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. బుధవారం కాస్త భారీ వర్షం పడింది. ఫలితంగా కాల్వలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు, రహదారులు పూర్తిగా జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తప్పని పరిస్థితుల్లో ఇళ్ల నుంచి వివిధ పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులను, రెయిన్ కోట్లను ఆశ్రయించినా తడవక తప్పలేదు.
– సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు





జోరు వర్షంలో బతుకుబండి



జగనన్నతోనే వాల్మీకులకు న్యాయం

కర్నూలు(అర్బన్): వాల్మీకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే న్యాయం జరుగుతుందని వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన అంశంపై వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో పలువురు ఎంపీలను కలిశామన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన తీర్మానంపై పార్లమెంట్‌లో చర్చించాలని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి, అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారీ రంగయ్య, ఆర్.కృష్ణయ్య తదితరులను కలసి వినతిపత్రాలు అందించామన్నారు. వాల్మీకి/బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ బిల్లు ఆమోదించాలని పార్లమెంట్‌లో మాట్లాడిన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వాల్మీకుల ఎస్టీ అంశం కొలిక్కి వస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

సారా విక్రేత అరెస్టు

ఓర్వకల్లు : మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో అక్రమంగా సారా అమ్ముతున్న ఓ వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని పెండేకంటి నగర్‌కు చెందిన షికారి పరుశ అనే వ్యక్తి గుట్టపాడు పరిసర ప్రాంతంలో నాటు సారా అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆ మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల సారాను, టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని అరెస్టు చూపినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా నాటుసారా, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నలుగురికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని చిన్నహరివాణం గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొని బుధవారం రాత్రి నలుగురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నగోనేహాల్‌కు చెందిన మోహన్, చిన్న ఈరన్న, గోవిందు ఒక బైకుపై వెళ్తుండగా వెనక నుంచి చిన్నహరివాణం గ్రామానికి చెందిన ఈరన్న బైకుతో ఢీకొట్టడంతో కింద పడిపోయారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇస్వీ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

• డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వాతావరణంలో మార్పులు వచ్చి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలను ఆదేశించారు. దోమ వ్యాప్తిని అరికట్టడంతో సగం వ్యాధులు దూరమవుతాయన్నారు. ఏఎన్ఎంలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన అహ్మద్ అలీఖాన్

కల్లూరు: ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన అహ్మద్ అలీఖాన్ బుధవారం సాయంత్రం పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



మేయర్ రామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అహ్మద్ అలీఖాన్

పోషకాహారలోప నివారణే ప్రధానం




గర్భిణికి ఐరన్ మాత్రలు అందజేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో పోషకాహార లోప నివారణ ముఖ్యమని, ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాలు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్ఆర్‌సీ కేంద్రాలను సంప్రదించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని జేఎస్ఆర్ నగర్, లక్ష్మీనగర్‌లలోని సచివాలయ పరిధిలలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. బరువు, ఎత్తు తక్కువతో పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ ఇంద్రధనస్సు సర్వేను తనిఖీ చేసి గర్భిణులు, పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలు ఏదైనా కారణం వల్ల ఇవ్వనట్లయితే ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో టీకాలు వేయించాలన్నారు. అనంతరం ఆయన స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పిల్లలు, తల్లులకు పోషకాహారం, ఐరన్‌మాత్రలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివ్య, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలి

కోడుమూరు రూరల్: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన వర్కూరు గ్రామ సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. బడి బయట ఉన్న పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 9వ తరగతి వరకు చదివి బడి మానేసి పనులకు వెళ్తున్న వర్కూరు చెందిన విద్యార్థులు మనీషా, శివాజీ వివరాలు తెలుసుకుని వారి ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపించేలా ఒప్పించారు. అనంతరం ఆ విద్యార్థులను హైస్కూల్‌కు తీసుకెళ్లి హెచ్ఎంతో మాట్లాడి 10వ తరగతిలో ప్రవేశాలు కల్పించారు.



విద్యార్థి శివాజీని వర్కూరు హైస్కూల్‌లో చేర్పిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



అభిషేకం చేస్తున్న పీఠాధిపతి బహ్మానంద సరస్వతి

ఓర్వకల్లు : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడిచినప్పుడే హైందవ మతం బలపడుతుందని హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, నైమిషారణ్య పీఠాధిపతులు బాలబ్రహ్మానంద సరస్వతి అన్నారు. బుధవారం మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో నిర్వహించిన శివలీలా విలాస లింగ తత్వం గురించి ప్రవచన కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఆలయ అధికారులు పీఠాధిపతికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముందుగా బుగ్గరామేశ్వర స్వామిని దర్శించుకొని అభిషేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో బ్రహ్మానంద సరస్వతి మాట్లాడుతూ.. పరమ శివుని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. పంచాక్షరి జపాలతో సకల పాపాలు తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కర్నూలు: ఇద్దరు మట్కా బీటర్లను బుధవారం మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. బుధవారపేటకు చెందిన షేక్ అబ్దుల్ ఫరీద్, షేక్ వలీ బాషా పడిపోయిన కమాన్ల వద్ద భారీగా మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ చిరంజీవి, క్రైం పార్టీ సిబ్బంది ప్రసాద్ సింగ్, చంద్రబాబు నాయుడు నిఘా వేసి మట్కా బీటర్లిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.10 వేల నగదుతో పాటు 9 మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

అప్రమత్తంగా పనులు చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలు, గాలి కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. సబ్‌స్టేషన్, లైన్ బ్రేక్ డౌన్స్, ఫీడర్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి సమస్యలు వస్తే ముందుగా ఎల్‌సీ తీసుకొని సరఫరా నిలిపివేసుకోవాలని సూచించారు. ఏఈలు, ఏడీఈలు, ఈఈలు తమ పరిధిలోని లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు.

ఎమ్మార్పీఎస్‌ఎస్‌తో వారికి సంబంధం లేదు

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు నియోజకవర్గం గూడూరుకు చెందిన సుజాత మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి(ఎమ్మార్పీఎస్ఎస్) మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలని చెప్పుకొని తిరుగుతోందని, ఆమెకు ఎమ్మార్పీఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని సమితి జిల్లా అధ్యక్షుడు దివాకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుజాతతోపాటు శ్వేత, లలితమ్మ, చిన్నబాబు, సుమిత్ర అనే మహిళలు కూడా ఎమ్మార్పీఎస్ఎస్ సభ్యులమని విజిటింగ్ కార్డులు తయారు చేయించుకుని తిరుగుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వారికి తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదనే విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు.

కూలిన మట్టిమిద్దె

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్లూరు అర్బన్ పరిధిలోని ఊరువాకిలి వద్ద మల్లికార్జునకు చెందిన మట్టిమిదె కూలింది. ఆయన మగ్గం పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మగ్గం పరికరాలు, వస్తువులు సుమారుగా రూ. 70వేల నుంచి లక్ష రూపాయాల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న కల్లూరు పరిరక్షణ సమితి నాయకులు చంద్రశేఖరప్ప, విశ్వనాథ్ ఇంటిని సందర్శించి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు.



కూలిన మట్టిమిద్దెను చూపుతున్న బాధితుడు

బయటి పిల్లలు బడిలో ఉండాలి

• కలెక్టర్ డాక్టర్ జి.సృజన



బి.క్యాంపు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి సృజన

కర్నూలు సిటీ: బడి బయట ఉండే పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల వివరాలను అప్డేట్ విషయమై బుధవారం ఆమె నగరంలోని పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా బిక్యాంపులోని ప్రభుత్వ(బాలుర)ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి స్కూల్ రికార్డులను పరిశీలించారు. స్కూల్ పరిధిలో బడి బయటి పిల్లలు ఉన్నారా? ఉంటే ఆ పిల్లలను స్కూల్‌లో నమోదు చేశారా? అనే వివరాలను కలెక్టర్ హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. సిస్టమ్ డ్రాపౌట్స్, స్కూల్ డ్రాపౌట్స్ అందర్నీ కూడా స్టూడెంట్ ఇన్ఫోలో అప్డేట్ చేయాలని సూచించారు. స్కూల్‌కు టీచర్లు వచ్చే వేళలు, వారు బోధించే అంశాల గురించి కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి క్లాసులోకి వెళ్లి కొద్దిసేపు కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆ స్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం గురించి, భోజన నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత గాయత్రి ఎస్టేట్‌లోని నారాయణస్కూల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ రికార్డులు పరిశీలించి విద్యార్థుల వివరాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యాభ్యాసం పూర్తయిన వారికి ఎందుకు టీసీలు ఇవ్వడం లేదని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. త్వరగా టీసీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట కర్నూలు డిప్యూటీ ఈఓ హనుమంతురావు, ఎంఈఓ విజయ కుమారి ఉన్నారు.

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఈశ్వరయ్య

కర్నూలు(న్యూసిటీ): టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా బుర్రా ఈశ్వరయ్య ఎన్నికయ్యారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జిల్లా టీడీపీ పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా పి.నెహమియ ఎన్నికయ్యారన్నారు.

ఢిల్లీ గడ్డపై రాయలసీమ గళం వినిపిస్తాం

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలను పరిష్కరించాలనని డిమాండ్ చేస్తూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టారు. రాయలసీమ ఉద్యమకారులు, రాయలసీమ వాదులు, సీమ ప్రజలు బుధవారం కర్నూలు నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలు దేరి వెళ్లారు. స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమం పార్టీలకు అతీతంగా రాయలసీమకు సంబంధించిందన్నారు.

బీసీ సభను జయప్రదం చేయండి

కర్నూలు (న్యూసిటీ): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఒంగోలులో జరగనున్న జయహో బీసీ సభను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార కమిటీల కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు కోరారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు సూచనల మేరకు కర్నూలు పార్లమెంట్ పరిధిలోని టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు గురువారం జరగనున్న బీసీ సభకు హాజరు కావాలన్నారు. రాయలసీమ జోన్ పరిధిలో ఉన్న బీసీ సాధికార సమితి సభ్యులందరూ ఒంగోలులో రవి ప్రియా గ్రౌండ్, గుంటూరు రోడ్డు సభ ప్రాంగణానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోవాలన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు

కర్నూలు (టౌన్): వలంటీర్ల వ్యవస్థను కించపరుస్తున్న తెలుగుదేశం, జనసేన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని 124వ సచివాలయ వలంటీర్ సుమలత అన్నారు. స్థానిక రోజా వీధిలోని సచివాలయం వద్ద బుధవారం స్థానికులతో కలిసి ఆమె ప్ల కార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నాయకుడు సాధికార సారథులను నియమించుకున్నప్పుడు ఎందుకు నోరు మెదపలేదన్నారు. ప్రభుత్వ సేవలను పేదలకు అందజేయడం చూసి కడుపు మండి ఆరోపణలు చేస్తున్నారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కౌతాళం: మండలంలోని తోవి గ్రామంలో బుధవారం రాత్రి అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకొని శంకర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని కోసిగి సీఐ ఎరిషావలి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శంకర్ నుంచి 6 బాక్స్‌లు.. 576 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శంకర్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు.